
పిట్లంలో నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర్

## లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి

పిట్లం, డిసెంబర్ 4: హరితహారం నర్సరీల్లో లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలని ఎంపీడీవో వెంకటేశ్వర్ సూచించారు. మండలకేంద్రంలోని నర్సరీని సోమవారం తనిఖీ చేసి మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు మొక్కల సంరక్షణపై పలు సూచనలు చేశారు. మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలని, క్రమం తప్పకుండా నీరు అందించాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి యాదగిరి, సిబ్బంది ఉన్నారు.

## చంద్రమౌళీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న సంజీవ్‌రావు పంతులు

నిజాంసాగర్, డిసెంబర్ 4: మండల కేంద్రంలోని చంద్రమౌళీశ్వర ఆలయంలో కార్తిక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి వేద పండితుడు సంజీవ్‌రావు ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చన తదితర పూజలు కొనసాగాయి. ఆలయాన్ని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. సాయంత్రం దీపారాధన కార్యక్రమం నిర్వహించగా మహిళలు దీపలు వెలిగించారు.

## 7న సామూహిక మహా పడిపూజ

మద్నూర్, డిసెంబర్ 4: ఈ నెల 7న మండల సామూహిక మహా పడిపూజ నిర్వహించనున్నట్లు గురుస్వామి లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలుర పాఠశాలలో మహా పడిపూజ ఏర్పాటుచేస్తున్నామని పేర్కొన్నారు. మధ్యాహ్నం భిక్ష, సాయంత్రం పూజ అనంతరం అల్పాహారం ఉంటుందని, మండలంలోని అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.



డోంగ్లీ మండలంలో సాగుచేస్తున్న జొన్న

## జొన్నసాగు.. లాభాలు బాగు

డోంగ్లీ, డిసెంబర్ 4 : మండలంలో జొన్నసాగు పెరిగింది. ఇతర పంటలకు అధిక పెట్టుబడితోపాటు చీడపీడల బాధ ఎక్కువగా ఉండడంతో ఆశించిన దిగిబడి రావడంలేదు. దీంతో లాభాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దంతో మండలంలోని రైతులు ఈ సారి ఎక్కువగా జొన్న సాగుపై మొగ్గు చూపారు. జొన్నలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండడతో లాభాలు బాగుంటాయని అంటున్నారు.

# శిథిలావస్థలో భవనాలు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలు
- కూల్చివేయాలని కోరుతున్న స్థానికులు

శక్కర్‌నగర్, డిసెంబర్ 4: బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లో గతంలో ఎన్ఎస్ఎఫ్ కొనసాగుతున్న కాలంలో నిర్మించిన పలు భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.కొన్ని భవనాలు, ఖాళీ స్థలాలు ప్రైవేట్ యాజమాన్యం ఆధీనంలో ఉండగా, మరికొన్ని కోర్ కమిటీ ఆధీనంలో ఉన్నాయి. అయితే ఈ భవనాలు ఎందుకూ పనికిరాకుండా పోవడంతో ఇవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శిథిలావస్థకు చేరిన భవనాల్లో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, ఏసీపీ కార్యాలయాల ఉండగా.. పరిసర ప్రాంతాల్లో ఉన్న సుమారు నాలుగు భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఇందులోకి వెళ్లేందుకు కొందరు దారిని ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. ఇప్పటికే ఈ భవనాలు పనికిరాకుండా పోగా, వాటివైపు ఎవరూ కన్నెత్తి చూడడంలేదు. దీంతో సదరు భవనాలను కూల్చి పైకప్పునకు ఉపయోగించిన రాడ్లు తొలగించుకుని అమ్ముకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు.శిథిలావస్థలకు చేరిన ఈ భవనాలను పూర్తిగా కూల్చివేయాలని అధికారులను కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన ఏసీపీ కార్యాలయ సమీపంలోని ఓ భవనం


శక్కర్‌నగర్‌లో ఎంవీఐ కార్యాలయం వెనుక శిథిలావస్థకు చేరిన పాత భవనం


భవనం శిథిలం కావడంతో చోరీకి గురైన వస్తువులు

## ఘనంగా ఘంటసాల జయంతి

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 4 : గాన గాంధర్వుడిగా, వందలాది సినిమాలకు స్వరాలు సమకూర్చిన ఘంటసాల చిరస్మరణీయులని వక్తలు కొనియాడారు. వినాయక్‌నగర్‌లోని స్వరసౌరభం కార్యాలయంలో ఘంటసాల 101వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ గణపతి అశోకశర్మ హాజరై మాట్లాడారు. మాధురి, సుజాత, సముద్రాల రాములు, అయాచితం నాగరాజుశర్మ, వేముల శేఖర్, శ్రీనివాస్.. ఘంటసాల సినీ, లలితగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వీపీ చందన్‌రావు, విశ్రాంత ఉపన్యాసకుడు మల్లేశం, తెలుగు వెలుగు చంద్రశేఖర్, లక్ష్మీనర్సయ్య, తల్లావఝుల గిరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## టీయూలో నేడు మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న టీయూ రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి, డిసెంబర్ 4 : టీయూలో నేడు (మంగళవారం)ఉదయం 10 గంటలకు బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో జన్యుశాస్త్రంలో మార్పులు – ఆరోగ్యంపై ప్రభాం అనే అంశంపై మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు సమన్వయకర్త డాక్టర్ ప్రవీణ్ మామిడాల తెలిపారు. విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజీ మ్యూజియం –బెంగళూరు, సీసీఎంబీ –హైదరాబాద్ శాస్త్రవేత్తల సహకారంతో వర్క్‌షాప్ కొనసాగుతుందని తెలిపారు. ఎగ్జిబిషన్‌కు సంబంధించిన బ్రోచర్‌ను టీయూ రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి సోమవారం విడుదల చేసి మాట్లాడారు. టీయూ పరిధిలోని అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులతో పాటు ఇంటర్మీడియట్, 9వ తరగతి, పదో తరగతి విద్యార్థులకు ఈ అవగాహన తరగతులు ఉపయోగపడుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ హాజరై జన్యుశాస్త్రంలో జరిగే మార్పులపై అవగాహన పొంది, భవిష్యత్తులో యువ శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. జన్యుశాస్త్రం మానవజీవన ప్రమాణ స్థాయిని ఏ విధంగా ప్రభావితం చేస్తుందో, మానవ మనుగడకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సమగ్రంగా అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ జవేరియా, డాక్టర్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మూడు పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

- రూ.2.48 లక్షల నగదు స్వాధీనం
- పోలీసుల అదుపులో 25 మంది పేకాటరాయుళ్లు

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 4 : నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్ ఆదేశాల మేరకు ట్రాస్క్‌ఫోర్స్ బృందాలు మూడు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. జిల్లా పరిధిలోని కోటగిరి/బోధన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పేకాట అడ్డాలపై ఆదివారం దాడులు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ అజయ్ బాబు, అంజయ్య తమ బృందంతో దాడి చేసి 25 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2 లక్షల 28 వేల 790 నగదును స్వాధీనం చేసుకున్నారు.

పట్టుబడిన వారిని తదుపరి చర్యల కోసం సంబంధిత పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలకు అప్పగించినట్లు తెలిపారు. దాడుల్లో సిబ్బంది అనిల్, రాంచందర్, సుధాకర్, రాములు, భూషణ్, నర్సయ్య, లస్మన్న, శంకర్, గజేందర్, ఆజాం తదితరులు పాల్గొన్నారు.